★ కథానిక

# నిరీశ్వరవాది

★ పైడిమఱ్ఱి

రామారావును అంత ఆదుర్దాగా, అలసటతో చూడడం నాకు అదే మొదటి మాటు. సావిట్లోకి వస్తూనే కుర్చీలో కూలబడుతూ నాలుగు గ్లాసుల మంచినీళ్లు తెప్పించవోయి అన్నాడు.

"తక్కిన ముగ్గురు ఏరి ?" అన్నాను.

"అబ్బే! నాకేనోయి అంతదాహంగా ఉంది" అన్నాడు.

అతను దాహం తాగుతూ "ఎంత తాగినా కడుపు వీరణం అవుతోందికాని దాహం మాత్రం తీరటంలేదోయి. ఇదేమిటోయి! ఇంత చల్లగానూ ఉంది, అదోతమాషా రుచిగా ఉంది!" అన్నాడు.

నీబోటి నెర్వసు పేషంట్లకు బెరిన్ ఇంజక్షనులా పని చేస్తుంది. తరవాణిలో కొద్ది మంచుగడ్డ, కొంచెం ఉప్పు, శొంఠిపొడుం వేశారులే" అన్నాను.

ఇంతట్లోకి మా పెద్దమ్మాయివచ్చి "ఇందాకా శుక్ర వారం పూజకు గుళ్లోపూజారివస్తే, ప్రసాదానికి నేను చిట్టిగార్లు చేయించమంటే అమ్మ శనగ లంటోందండి."

"నీకు నచ్చిందే చేయించు తల్లీ" అన్నాను.

"ఏమిటీ! మాటిమాటికీ ఆపితూరీలు. తండ్రికి కూతురికి సరిపోయింది; ఎవరు చేయించనన్నారేమిటి ?" అనే మాటలు లోపలి యింట్లోనుంచి వినిపిస్తూనే ఉన్నాయి.

"ఏమోయి! నీకూ ఉన్న దేమిటోయి? ఈ దేముడు, దెయ్యం పిచ్చి ?" అన్నాడు రామారావు.

"ఎవరికి లేదేమిటి ?" అన్నాను.

"నాకు లేదు" అని ధీమాగా అన్నాడు.

"పోనీలే! నువ్వు లేనివాళ్లలో జమ" అన్నాను.

"నేను వేళాకోళంగా అనటం లేదోయి. తీవ్రంగా ఆలోచించాకే వచ్చాను ఈ నిశ్చయానికి. లేదు, లేదు ముమ్మాటికి దేముడు లేడు. ఈ రెండు రోజులనుంచి నాకు మతి పోయి నట్టయిందనుకో. నిజంగా దేముడనేవాడు వుంటే మా యింటి పక్కయింటి అమ్మాయికి అటువంటి స్థితి పడుతుందటోయి ?"

"మొన్న నేను జైలులో ఉన్నప్పుడు నా కొక తైనాయతు ఉండేవాడు. వాడూ .. ....."

"బ్రదర్! నేనేదయినా మాట అనేటప్పటికి అనగా, అనగా రాజు అని మొదలు పెడతావు; వినక పోతే నీకు కోపం. నీ పిచ్చి, పిచ్చి కథలతో నాకు నచ్చచెప్పకు. ఈ విషయంలో నిజంగా చాలా ఆవేదన పడుతున్నాను."

"నీ ఆవేదన నీ ముఖంలోనే కనబడుతోంది. నే నెదో కల్లబొల్లి కథలు చెప్పి నీ బుద్ధి మారుతోవని పట్టించదలచ కోరే నీ మాదిరిగానే 'దేముడు నిజంగా లేడు బాబూ' అనేవాడు ఒకడు ఉండే వాడని చెప్పబోయాను. నీకు నచ్చుతుందనే మొదలు పెట్టా. నీకు కష్టంగా ఉంటే మానేస్తా "

"అబ్బే, అదికాదోయి. నువ్వేదో ......సరే చెప్పు విందాం" అన్నాడు రామారావు.

* * *

"వెంకటస్వామి ప్రతివాళ్లను కొద్దో గొప్పో ఆకర్షించే వాడు. అతను అమాయకుడా అంటే అమాయకుడూ కాదు. వెర్రివాడా అంటే అదీ కాదు. కాని అతని ధోరణిలో ఒక ప్రత్యేకత ఉంది. ఎవరు ఏ పని చెప్పినా 'నే చెయ్యనని' కాని, 'కొద్దిసేపు ఉండండని' కాని, చికాకుపడడంగాని ఎన్నడూ చూడలేదు. అతను నలుగురిలో కూర్చొని కబుర్లు చెప్పడం యింతవరకు లేదు. ఎప్పుడు పిలిచినా ఆదమరుపుగాను, ఉలిక్కిపడి సమాధానం చెప్పేవాడు. పని లేనప్పుడు ఒక్కడు కూర్చొని శూన్యంలోకి

## హృదయం లేని 'లా'

చూస్తూ కళ్ల నీళ్లు పెట్టుకొనేవాడు. రాత్రిళ్లు కూడా అతను నిద్రపోడని, ఏదో గొణుగుకొంటూ ఉంటాడని, చాలా సార్లు చెప్పరాని యమయాతన పడుతూఉంటాడని అతనితో ఉన్నవాళ్లు చెబుతారు.

# నిరీశ్వరవాది

ఆతను ఎప్పుడు ఏదో మరచి పోయిన వస్తువు కొరకు వెతుక్కుంటూ ఉన్నట్లు, ఎందుకో ఆదుర్దా పడుతూ ఉన్నట్లు కనిపించేవాడు. ఇతరుల పని విషయంలో ఎంత శ్రద్ధవహించేవాడో తన విషయంలో అంత అశ్రద్ధగా ఉండే వాడు. ఒక రోజున

"ఏమోయి, ఆ మురికి గుడ్డలతో ఉండడం బాగా లేదు" అన్నాను.

"ఏం బాబు"

"ఏం ఏమిటోయి? మురికి గుడ్డలు కట్టుకోడం అనారోగ్యం"

"మీకు యిష్టం లేకపోతే ఉతికి కట్టుకొంటాను బాబు" అన్నాడు.

ఏ పని చేసినా తన కొరకు కాదనేటట్లు ప్రవర్తించే వాడు. పాలూ, రొట్టె తినమని యిస్తే 'నా కెందుకు బాబు' అనే వాడు. పట్టుబట్టి నాలుగు సార్లు యిస్తే, ఇంకొక ఖయిదీకి తీసుకు వెళ్లి యిచ్చివేయడం కూడా చాటునుండి కనిపెట్టాను. కాని కేకలు వేస్తే లాభంలేదని ఊరుకొన్నాను. ఒక రోజున ఒక మంచి పిండివంట తీసుకు వచ్చి నా ముందు తినమని పట్టుబట్టాను. తప్పని సరిగా ఎట్లాగో అట్లాగ నమలకుండా మింగివేశాడు. ఇంకొక అరగంటకు చూస్తిని గదా నా కొట్టు వెనుకనున్న చింతచెట్టు క్రింద కూర్చొని వెక్కి, వెక్కి ఏడుస్తున్నాడు. ఇతనెదో చెప్పరాని ఆవేదన పడుతున్నాడని తెలుసుకొని అప్పటి నుండి అతనిని బలవంత పెట్టడం మానివేశా.

కాని నాకు తహినాయతు అయినప్పటి నుండి అతనిలో కొద్ది మార్పయినా లేక పోలేదు. 'స్వామి' అని పిలిచే టప్పటికి హాజరయేవాడు. నాకు కావలసిన పని తనే ఆలోచించి ముందుగానే చేసేవాడు. ప్రతి నిమిషం నా సేవ కొరకే కనిపెట్టుకొని కూర్చొన్న వాడల్లే ఉండేవాడు. నిద్ర పోతూ ఉంటే కూడా విసుగుతో నుంచొనేవాడు. ఈ విషయాలలో నేనెంత చికాకు పడ్డా, విశ్రాంతి తీసుకోమని ఎన్ని సార్లు చెప్పినా లాభం లేక పోయింది. ఒక రోజున

"నా విషయంలో నీ కింత శ్రద్ధా భక్తులు ఎందుకోయి" అని అడిగాను.

"నాకు యింత కన్న పనేముంది బాబు. నా జీవితాంతంవరకు మీ సేవే కోరు కొంటాను." అని అంతట్లోనే నాలిక కరచుకొని "ఎంత పొరపాటు మాటన్నాను క్షమించండి బాబు. అంత బుద్ధి తక్కువ కోరికకోరడం తప్పేను"

"నువ్వంత బాధ పడడానికి నువ్వు అన్నదాంట్లో తప్పేముందోయి."

"తప్పు కాదండీ బాబూ! ఎంత తప్పు మాట! బతికున్నంత కాలం యిక్కడ ఉండవలసిన వాడిని, ప్రాణం ఉన్నట్లూ మీ కొలువు కోరుతున్నాను అంటే మిమ్మల్ని కూడ ఇక్కడ ఉండి పొమ్మని కోరడం కాదు బాబూ? నా తప్పు క్షమించండి" అన్నాడు.

"నువ్వు అన్నదాంట్లో ఆఘాయత్యం లేదు. ఇక్కడికి మేము యింకా ఎన్ని సార్లు రావాలో" అన్నాను.

"వద్దు బాబూ వద్దు. ఇక మీరు రానక్కర లేకుండానే మీ శపథం నెగ్గుతుంది. మీ బోంటివాళ్లను జైలులో పెట్టే ఈ దొరతనం ఆట్టేకాలం అచ్చిరాదు" అన్నాడు.

"నీ బోటి అమాయకులకు కూడా అటువంటి తలంపు ఉన్నప్పుడు పరమేశ్వరుడు మహాత్ముని కోరిక చెల్లిస్తాడు." అన్నాను.

"పరమేశ్వరు డంటే నండి?" అన్నాడు.

"అంటే దేముడ"న్నాను.

"దేముడు మాట నాకు తెలియదు. తెలియ దేమిటి కాని, అసలు దేముడు ఉంటే గదా అండి. ఆ మాట చెప్పకండి బాబు. కాని గాంధిగారు మాత్రం మా గొప్ప వారండి" అన్నాడు.

"ఏం? ఎందు చేత?" అన్నాను.

"ఆయన ఎంత గొప్పవారు కాక పోతే మీ బోటి వారంతా ఆయన మాట విని, సంసారాలు వదులుకొని యిక్కడకు వస్తారండి బాబు" అన్నాడు.

అతని అమాయకపు కొలత బద్దకి నాకు నవ్వువచ్చింది.

* * *

మర్నాడు మధ్యాహ్నం నేను చదువు కొంటూ ఉంటే నా దగ్గరకు నెమ్మదిగా పిల్లిలా చేరాడు.

"బాబూ! నిన్న నా మాటలకి క్షమించాలి" అన్నాడు.

"ఏ మాటలోయి?" అన్నాను.

# నిరీశ్వరవాది

"దేముడు మాట నాతో ఎత్తవద్దన్నాను. దేముడు లేడనే నమ్మకం నాకు ఉంటే ఉండవచ్చు; ఆ మాట నాతో చెప్ప వద్దనడానికి నేను ఎంతటి వాడిని బాబు."

నేను చదువుతూ ఉన్న పుస్తకం మూసి, అతని వైపు తిరిగి

"వెంకటస్వామి, నువ్వు అన్న మాటలలో తప్పేమీ లేదు. కాని ఒక్క మాట అడుగుతాను. నీకు దేముడు లేడనే నమ్మకం ఎందుకు కలిగిందోయి" అన్నాను.

"అది చాలా పెద్ద గాథ బాబు" అన్నాడు.

* * *

"నా కొక చెల్లెలు......ఉండే దండి" అని మొదలు పెట్టగానే అతని కళ్లంట బొట బొట నీళ్లు కారాయి.

"మాది అంత ఉన్న కుటుంబం కాదు గాని, తిండి కోసం వెలితి పడ్డవాళ్లం మాత్రం కాదు. స్వంత కొంద్ర లేక పోయినా, ఏ పెద్ద రయితు చాటునో ఉండి, ఏ బ్రాహ్మల యీనామొకవులుకు పుచ్చుకొని నేనూ, మా బాబూ కాలం గడిపేవాళ్లం. ఈ యుద్ధం యింకా రెండేళ్లు ఉందనగా మా బాబు వ్యాపారం చేస్తానని రంగం వెళ్లి పోయాడు. రంగం వెళ్లే ముందే మా చెల్లాయికి మంచి సంబంధంచూసి పెళ్లి చేశాడు. యుద్ధం రాగానే మా బావ పటాలంలోకి వెళ్లి పోయాడు. రంగం పడిపోయాక మా బాబు వయినం తెలియనే లేదు. మా బాబు, బావల కోసం మా అమ్మ బెంగ పెట్టుకొని, మంచం పట్టి చచ్చి పోయింది. అప్పటికి మిగిలింది నేనూ, మా చెల్లాయి. మా అమ్మ పోయాక మా చెల్లాయి పేర మా బావ దగ్గరనుండి ప్రతి నెలా మనిఆర్డరు వచ్చేది. ఆ డబ్బుతోటీ, నా రెక్కల కష్టంతోటీ మా చెల్లెలు గడపదాటనవసరం లేకుండా చేశాను. మా అమ్మ పోయిన ఏడాదికి, అంటే సంకురాత్రి పండగ రోజుల్లో మా బావ శెలవమీద యింటికి వచ్చాడు. మా బావను చూడగానే మా చెల్లాయి లక్ష్మీదేవల్లే కల కలలాడి పోయింది. వాళ్ల సంతోషం చూచి నేను మా బాబుని, అమ్మను మరచి పోయాను, నాకూ వాళ్ల తోడిదే లోక మని నమ్మాను.

ఆవాళ సరిగా కనుపు పండుగ అనుకొంటాను. రాత్రి మా వూరి పాలెంలో అమ్మవారికి పెద్ద ఉత్సవం. మా బావ మా చెల్లాయి యింటి దగ్గరే ఉండి పోయారు. నేను మాత్రం పండుగకు మా బావ నాకు యిచ్చిన నాలుగు జేబుల చొక్కాలాంటి కోటు, మట్టులాగు తొడుగుకొని మెడలో రుమాలు చుట్టి అమ్మవారి సంబరానికి వెళ్లాను. కిరసనాయలు లేని రోజులలో కూడా గ్యాసులైట్లతో మైదానమంతా మెరసిపోతోంది. బుట్టబొమ్మలు, నాటకం వేషాలు, వెంకటేశుడప్పుల జోడాలతోటి, మేళాలతోటి ఒకరిమాట యింకొకరికి వినిపించనంత గొడవగా ఉంది. నాలుగు ఆమడలనుంచి కూడా వచ్చి కోడి పందాలు ఆడు తున్నారు. నుంచున్న చోట నుంచోకుండా, కూర్చున్న చోట కూర్చోకుండా జాము రాత్రి ఉండనేదాకా తిరిగాను. నేనూ యింటి మొగం పట్టగానే రామన్నగారి వెంకటచలం కూడా వచ్చాడు. పంతులుగారి కట్టవ దగ్గరకు వచ్చేటప్పటికి

"ఏం రా! నువ్వు సగం డబ్బు పెట్టుకోక పోతే వీలులేద"న్నాడు వెంకటచలం.

"ఏం డబ్బురా?"

"నిరుడు సంకురాత్రి పండుగనాడు మనం కోడి పుంజుల్ని పెంచి మళ్లీ ఏటికి పందెం కాద్దామని అనుకొన్నాము. అందుచేత నే వేశిన పందాలలో చెరిసగం పెట్టుకోవాలి"

నే తెల్లబోయాను.

"నేను రెండు పుంజుల్ని కొని ఏటికేడాది మేపాను. రెండు పుంజులు ఓడి పోయాయి. నువ్వు సగం నష్టం కట్టుకోవాలి" అన్నాడు.

"ఇదేందిరా, నువ్వు పుంజుల్ని కొన్నదీ తెలియదు, పెంచిందీ తెలియదు, పందెం వేసిందీ తెలియదు నా కేది పట్టిందిరా నష్టం పెట్టుకోడానికి" అన్నాను.

"మనం అనుకొన్నట్టుగా జరగాలి" అని పట్టుబట్టాడు.

మాట మీద మాట పెరిగి పోయింది. మా యిద్దరి వయసు సమానమయినా నా కన్న కొంచెం బలమయిన మనిషి కాబట్టి మీద చేయి చేసుకోబోయి "డబ్బు యివ్వక పోతే నా కోడి గతే నీకూ పడుతుందని కోళ్ల కత్తులు తీశాడు. నేనూ మొలనున్న పంజాబు వాళ్ల దగ్గర కొన్న కత్తి తీశాను. చీకట్లో ఎక్కడ పొడిచానో తెలియదు

కాని ఒక్క పోటు మాత్రం పొడిచాను. వాడు కేకవేసి పడిపోగానే నేనూ కంగారుతో పారిపోయాను.

ఇంటికి వెళ్లాక మా చెల్లెలు, మా బావ పడుకొన్న గది తలుపు తెరచి చూచాను. దీపం వెలుగులో వాళ్లు హాయిగా ఆనందంగా నిద్రపోవడం చూచాను. ఆ దీపం వెలుగులోనే నా చొక్కా మీద నున్న రక్తపు మరకలు కూడా కనిపించాయి. దాంతో నా గుండెలు దడ, దడలాడాయి. ఆ బట్టలు తీసి యింకొక బట్టలు కట్టుకొని రక్తం మరకల బట్టలు దొడ్డో గోతిలో పాతిపెడుతున్నాను. అప్పటి కప్పుడే కనుచీకటిగా ఉంది. మా దొడ్డి పక్కనుండి జనం పోతూ, వెంకటచలం చచ్చి పోయాడని, చంపిన వాడె వరో అని జనం తహ. తహలాడుతున్నారని చెప్పుకొంటూ పోతున్నారు. ఆ మాటలు వినగానే నాకు భయంవొచ్చ యింది. కాళ్లాడక, ఏమి చేయడానికి తోచక ఆ ఊరి నుంచి పారి పోయాను. ఆ మర్నాడే పోలీసులు మా బావను పట్టుకొన్నారు. రెండు మూడు రోజులకి నేనూ పట్టుబడి పోయాను.

మా చెల్లెలికి, వెంకటచలానికి ఛ, ఛ ఇంత కన్న పచ్చి అబద్ధం లేదండి — ఈ విషయం మా బావకు తెలిసి వెంకటచలాన్ని చంపినట్లు, అందుకు మా బావను నేను ప్రోద్బలం చేసినట్లు పోలీసులు కేసు పెట్టారు. మా గది తలుపు నేను తీసినప్పుడు నా చేతినున్న రక్తం ఆ తలుపుకు అంటుకొంది. నేను దొడ్లో పాతిపెట్టిన చొక్కా మా బావ యిచ్చిందే కాబట్టి మా బావ మీద కేసు మోపయింది. మా బావ తన కేదీ తెలియదని వాదించాడు. నేను నిజం చెప్పి మా బావను బ్రతికించు కొంటానని ప్లీడరుగారితో చెప్పాను. చంపుతూ ఉండగా చూచిన వాళ్లు ఎవళ్లూలేక పోవటం చేత కేసు నిలవదని, నేను నిజం చెప్పినా కోర్టు వారు నమ్మరని నచ్చ చెప్పి నాకూ 'ఏమీ తెలియదని వాదించమన్నారు.

కోర్టువారు పోలీసువారి కేసు నమ్మారు. మా బావకు ఉరిశిక్ష, నాకు యావజ్జీవఖైదు వేశారు.

మా బావకు ఉరిశిక్ష ఖాయపడగానే, రేపు మా బావను ఉరి తీస్తారనటా, జైలు తోట యివతలి పెద్ద నూతిలో మా చెల్లెలు పడిపోయింది. ఆ సంగతి తెలియగానే మా బావకూడా కొయ్య బారిపోయి చచ్చిపోయాడని, శవాన్ని రాత్రల్లా ఉంచి, మర్నాడు చచ్చిన కట్టెను ఉరి తీశారని వార్డర్లు చెప్పారు." అని వెంకటస్వామి గోలు, గోలున ఏడవడం మొదలు పెట్టాడు. అప్పుడు అతని బాధ చూస్తే ఎందుకు అడిగానా యీ విషయం అనిపించింది.

"ఊరుకో వెంకటస్వామి. మనస్సుకు ఆట్టే పట్టించు కోకు" అని ఏదో అర్థం లేని ఓదార్పు మాటలన్నాను.

"అది కాదండి బాబు. నువ్వెందుకు ఒతికున్నావంటా రేమో నేనూ చచ్చి పోవలసిన వాడినే, కాని, ఎల్లాగో అల్లాగ జైలునుంచి బయలు పడ్డాక, మా ఊరు పోయి, మా చెల్లెలు అరుంధతి లాంటిదని చెప్పేదాకా ఈ కంఠంలో ప్రాణం ఉంచేచాలు. నిజంగా దేముడే ఉంటే, వాళ్లు అల్లాగ చావడం కాని, మా చెల్లాయిని పోలీసువాళ్లు అల్లాగ అనడంగాని జరుగుతుందా బాబు."

రామారావువైపు చూస్తూఉంటే మొఖం పక్కకు తిప్పి కళ్ల నీళ్లు తుడుచుకోడం మొదలు పెట్టాడు.

నవ్వుతూ "నీ అంత ఎమోషనల్ మేన్ లేడోయి" అన్నాను.

అతను పెద్ద నిట్టూర్పు విడిచి గొంతుక సకిలించాడు.

"నిజంగా పరమేశ్వరుడు ఉండడం చేతనే ఆ ప్రియ జీవు లిద్దరు యింకొక లోకంలో దివ్య జీవనం గడుపుతున్నారని, తన అపరాధానికి తాను యిక్కడే నరకం అనుభవిస్తున్నానని పాపం, వెంకటస్వామి గ్రహించ లేక పోయాడు" అన్నాను.

'అవునన్నట్లు'గా రామారావు తల ఊపాడు.

